క్లుప్తంగా

విద్యార్థుల్లో నైతిక విలువల పెంపు అవసరం



కొడవలూరు: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రంథాలయాధికారిణి కె.రాజేశ్వరి అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కొడవలూరులోని గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు కఠినమైన తెలుగు పదాలను నేర్పడంతో పాటు నైతిక విలువలున్న కథలను వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించే అవకాశం ఉందన్నారు.

నేత్రదానం



సరోజమ్మ (ఫైల్)

విడవలూరు: మండలంలోని దంపూరు గ్రామానికి చెందిన పోశింరెడ్డి సరోజమ్మ(70) అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబసభ్యుల కోరిక మేరకు ఆమె నేత్రాలను మనసేవా సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు మోహన్ ఐ ఆస్పత్రి సిబ్బంది సేకరించారు. ఆమె నేత్రాలను టెక్నీషియన్ వేణు, నాగేశ్వరరావు సేకరించారు.

అన్నమయ్య సంగీత విభావరి నేడు



మాట్లాడుతున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): తాళ్లపాక అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని మాగుంట లేఅవుట్లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య సంగీత విభావరిని శనివారం సాయంత్రం నిర్వహించనున్నామని నిర్వాహకులు లక్ష్మీప్రసన్న, రమాదేవి తెలిపారు. నగరంలోని ఆర్ఆర్ స్ట్రీట్లో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడారు. కార్యక్రమాన్ని గురుకృప సంగీత విద్యాలయం, భారతీ సంగీత విద్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని చెప్పారు. దువ్వూరి బెనర్జీ పాల్గొన్నారు.

పాట కచేరి రేపు

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో సినీ సంగీత విభావరిని సితార ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నామని నిర్వాహకుడు కుమార్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల కళాకారులు 79953 99341 నంబర్ను సంప్రదించాలని సూచించారు.

పోలూరి శతజయంత్యుత్సవ సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): ఆంధ్ర వాల్మీకి పోలూరి హనుమజ్జానకీరామశర్మ శతజయంతి ఉత్సవాల ఏడో సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకుడు వేదం రాధాకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు



మాట్లాడుతున్న హేనా సుజన్

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ పేర్కొన్నారు. జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీఓలతో గాంధీనగర్లోని మహిళా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తల పనితీరు మెరుగుపడేలా కేంద్రాలను సీడీపీఓలు, సెక్టార్ సూపర్వైజర్లు తనిఖీ చేయాలని సూచించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీ కేంద్రాలను ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ కార్యాలయ సీడీపీఓ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పుష్పాంజలి

నెల్లూరు(బృందావనం): గౌతమ బుద్ధుడి జయంతిని నగరంలోని నర్తకి సెంటర్లో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడి చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప, జయప్రకాష్, దగ్గుబాటి రాధాకృష్ణ, శింగంశెట్టి మురళీమోహన్ రావు, శీనయ్య, సత్యం, మోతే మల్లికార్జున, అబ్దుల్, రాము, మహేష్, వినోద తదితరులు పాల్గొన్నారు.

చోరీలు సరే.. రికవరీలు ఏవీ..?

- పెట్రేగిపోతున్న దొంగలు
- ఏటా పదుల సంఖ్యలో మోటార్ల చోరీ
- పట్టించుకోని పోలీసులు



కంటేపల్లిలో పైపులు కట్ చేసి విద్యుత్ మోటారును అపహరించిన దృశ్యం (ఫైల్)

వెంకటాచలం: వెంకటాచలం మండలంలో ప్రతి ఏటా పంట పొలాల్లో రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్ల చోరీకి గురవుతున్నాయి. పట్టపగలే దొంగలు పెట్రేగిపోతూ విద్యుత్ మోటార్లను మాయం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో రైతులు ప్రతి ఏడాది విద్యుత్ మోటారు చోరీల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

పైపులు కట్ చేసి..

వెంకటాచలం మండలంలో 50 వేల ఎకరాలు వరిసాగు చేస్తుండగా అందులో 10 వేల ఎకరాలకు పైగా విద్యుత్ మోటార్లు ఆధారంగా రైతులు పంటలు పండించుకుంటున్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 2500లకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే ప్రతి ఏటా పంట పొలాల్లో రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. మండలంలోని తిక్కవరప్పాడు, కంటేపల్లి, గొలగమూడి, కందలపాడు, కనుపూరు, పులితీగలపాడు, కసుమూరు, కురిచెర్లపాడు తదితర గ్రామాల్లో వ్యవసాయానికి సంబంధించి ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ గ్రామాల్లో నేలబావులు, కాలువలపై విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకుని రైతులు పంటలు పండించుకుంటున్నారు. రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు పొలాల్లోకి వెళ్లి పైపులు కట్ చేసి విద్యుత్ మోటార్లను చోరీ చేస్తున్నారు. గత మూడేళ్లుగా విద్యుత్ మోటార్ల చోరీ దొంగలు పట్టపగలే పెట్రేగిపోతున్నారు. ఏటా పదుల సంఖ్యలో విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిక్కవరప్పాడు, కంటేపల్లి గ్రామాల్లో గతేడాది పలువురు రైతుల విద్యుత్ మోటార్లు రెండు దఫాలుగా అపహరణకు గురయ్యాయి. విద్యుత్ మోటార్ల చోరీలపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏటా పదుల సంఖ్యలో చోరీలు జరుగుతున్నా, చోరీల నియంత్రణకు చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వస్తున్నాయి. మూడేళ్ల కాలంలో మండల పరిధిలో 100కు పైగా విద్యుత్ మోటార్ల చోరీ జరిగినా, ఒక్క విద్యుత్ మోటారు కూడా రికవరీ చేసిన దాఖలాల్లేవని తెలుస్తోంది. ఇకనైనా పోలీసులు జోక్యం చేసుకుని విద్యుత్ మోటార్లు చోరీకి గురికాకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏటా నష్టపోతున్నాం



ప్రతి ఏటా పొలాల్లోని విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తుండడంతో నష్టపోతున్నాం. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా వచ్చి పైపులు కట్ చేసి మోటార్లు ఎత్తుకెళుతున్నారు. గత రెండేళ్లలో మా పొలంలో 2 మోటార్లు చోరీకి గురయ్యాయి. చోరీలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టాలి.

– కె.చంద్రమోహన్, తిక్కవరప్పాడు

చోరీలను అరికట్టాలి



గ్రామ పరిధిలో గత మూడేళ్లలో విద్యుత్ మోటర్ల చోరీలు విపరీతంగా జరుగుతున్నాయి. నిత్యం మోటార్ల వద్దకు వెళ్లి చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ మోటారు చోరీ జరిగితే ఆర్థిక నష్టం జరగడంతోపాటు పంటకు నీరు అందించాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– మందల వరప్రసాద్, తిక్కవరప్పాడు

చర్యలు చేపడతాం

విద్యుత్ మోటార్ల చోరీలు జరగకుండా చర్యలు చేపడతాం. ఇటీవల చోరీల గురించి మా దృష్టికి రాలేదు. గ్రామాల్లో నిఘా ఉంచి విద్యుత్ మోటార్లు చోరీ జరగకుండా చూస్తాం.

– అంకమరావు, సీఐ

వైభవంగా చెన్నకేశవుడి కల్యాణం



శ్రీదేవీ భూదేవీ సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



అశ్వవాహనంపై పార్వేటకు వెళ్తున్న స్వామి, అమ్మవార్ల

ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో కొలువైన శ్రీదేవీ భూదేవీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో గత ఐదు రోజులుగా బ్రహ్మోత్సవాలు ఆలయ అర్చకులు తులసీ రామాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా గురువారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం ఆలయ యాగశాలలో మహాసుదర్శన యాగం నిర్వహించారు. తదనంతరం వసంతోత్సవం, పల్లకి సేవ నిర్వహించారు. ఆ తర్వాత స్నపన తిరుమంజనం, చక్రస్నానం వేడుకలను కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం దేవతోద్వాసనం, ద్వాదశ ఆరాధన, పుష్పయాగం శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం దేవదేవేరులకు అశ్వవాహనోత్సవం, పార్వేట ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. చివరగా మహాపూర్ణాహుతి సమర్పించారు. ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ ధర్మకర్తలు ముంగర బాలకృష్ణారెడ్డి – నిత్యనాగిని దంపతులు బ్రహ్మోత్సవాలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆలయ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



గ్రావెల్ తోలి చదును చేసిన ఆలయ భూమి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామంలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయానికి చెందిన 0.90 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని తెలుస్తోంది. ఆక్రమణదారులు ఆ భూమిలో గ్రావెల్ తోలి చదును చేశారు. ఈ విషయమై గ్రామస్తులు శుక్రవారం నెల్లూరులో ఆర్డీఓ మలోలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆలయ చైర్మన్గా చేసిన ఓ నాయకుడి కనుసన్నల్లో ఆలయ భూమి ఆక్రమణ జరిగిందని ఆరోపించారు. స్థలం విలువ రూ.3 కోట్లు ఉంటుందని, సదరు స్థలంలో భక్తులకు అవసరమైన విశ్రాంతి గదులు, కల్యాణ మండపం నిర్మిస్తే బాగుంటుందని తెలిపారు. ఆర్డీఓ స్పందిస్తూ గ్రామస్తుల ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేరాల అదుపు కోసమే కార్డన్ సెర్చ్



పట్టుకున్న వాహనాలతో సీఐ రాంబాబు, సిబ్బంది

పొదలకూరు : నేరాలను అదుపు చేసేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పొదలకూరు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. పట్టణంలోని విఘ్నేశ్వరపురం కాలనీలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెట్రోలు బంకుల్లో క్యాన్లు, బాటిళ్లకు పెట్రోలు పట్టకూడదన్నారు. టపాసులను గోదాముల్లో దాచుకుని అమ్మకాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యేంత వరకు జనాలు గుంపులుగా ఒకేచోట ఉండడం, అరుపులు, కేకలు వేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని తెలిపారు. కోడ్ తొలగే వరకు కార్డన్ సెర్చ్ కొనసాగిస్తామన్నారు. మైనర్లు వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని, వారికి వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, సరైన పత్రాలు లేకుండా వాహనాల్లో వెళితే కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరపురం కాలనీలో సరైన పత్రాలు లేని 9 వాహనాలను సీఐ సీజ్ చేశారు. కార్డన్ సెర్చ్లో మనుబోలు ఎస్సై అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో శ్రీఅన్నపూర్ణాంబ సమేత ప్రసన్నవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మద్రి గిరిబాబు – సురేఖ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం వసంతోత్సవం, పార్వేట, అలకలతోపు, అశ్వ వాహనోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు సంగం పెంచలయ్య ఉభయదాతగా వ్యవహరించారు.

‘ఆరోగ్య ఆంధ్రప్రదేశ్’గా తీర్చిదిద్దడమే లక్ష్యం

తోటపల్లిగూడూరు: రాష్ట్రాన్ని ‘ఆరోగ్య ఆంధ్రప్రదేశ్’గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కోడూరు బిట్–1 సచివాలయం పరిధిలో ఉన్న చెన్నపల్లిపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో కోడూరు పీహెచ్సీ వైద్యాధికారి నరేంద్ర, చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ జయపాల్రెడ్డి, జనరల్ మెడిసిన్ డాక్టర్ సాయివైష్ణవి, కంటి వైద్య సహాయకుడు గోపి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్యశిబిరంలో 260 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రమేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఉమర్, పర్యవేక్షకుడు సతీష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మౌళియాదవ్కు డాక్టరేట్



మౌళియాదవ్కు డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్నజీర్

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళేనికి చెందిన ఎస్.మౌళియాదవ్ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ‘కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ఇంటర్ వెన్షన్స్ టువర్డ్స్ ప్రాజెక్ట్ ఎఫెక్టెడ్ పీపుల్ – ఏ స్టడీ ఇన్ నెల్లూరు డిస్ట్రిక్ట్’ అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.మధుమతి పర్యవేక్షణలో మౌళియాదవ్ పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. ఈ మేరకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ అందజేసింది. బుధవారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్నజీర్ చేతులమీదుగా మౌళియాదవ్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మౌళియాదవ్ను శుక్రవారం పలువురు అభినందించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నెల్లూరు(బృందావనం): నగరంలోని 47వ డివిజన్లో గల సంతపేట గుప్తా పార్కు సమీపంలో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను ఎంహెచ్ఓ వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలనే బాధ్యతను ప్రజలు గుర్తించారని తెలిపారు. స్థానిక సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు అశోక్, జిలానీ వినూత్నంగా ఆలోచించి పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రపర్చి.. చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో చూపిన చొరవను అభినందించారు.

తెలుగు పరీక్షకు 11 మంది హాజరు

మనుబోలు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన తెలుగు పరీక్షకు కేవలం 11 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు డిపార్ట్మెంటల్ అధికారి కాంతారావు తెలిపారు. మనుబోలు, సైదాపురం మండలాలకు చెందిన 57 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 46 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



తోటపల్లిగూడూరు: తోటపల్లిగూడూరు మండల నూతన ఎంపీడీఓగా కేఎస్ బాలాజీ శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా పెద్దతిమ్మసముద్రం ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై తోటపల్లిగూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిపోయి ఇద్దరు గాయపడిన ఘటన వెంకటాచలం మండలం కసుమూరు పంచాయతీ చింతలపాళెం వద్ద శుక్రవారం జరిగింది. నెల్లూరు నగరంలోని పద్మావతి సెంటర్ ప్రాంతానికి చెందిన ఇబ్రహీం, నజీర్ కసుమూరు దర్గాకు వచ్చారు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా, చింతలపాళెం వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా స్థానికులు గమనించి చికిత్సనిమిత్తం నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంతో మేలు

తోటపల్లిగూడూరు: పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగంతో దుష్ప్రయోజనాలు ఉన్నాయని, సేంద్రియ ఎరువులు ఉపయోగించడం ద్వారా నేల ఆరోగ్యంగా ఉంటుందని ఇందుకూరుపేట వ్యవసాయశాఖ ఏడీఏ రాజ్కుమార్ తెలిపారు. మండలంలోని మాచర్లవారిపాళెం రైతుభరోసా కేంద్రం పరిధిలో శుక్రవారం పంటల సాగులో సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువుల ద్వారానే సాధ్యమని తెలిపారు. మట్టి పరీక్షలకు అనుగుణంగా మంచి ఎరువులను ఎంచుకోవాలన్నారు. భూసారాన్ని నశింపజేసే రసాయన ఎరువుల మోతాదును తగ్గించి పచ్చిరొట్టి ఎరువులు, జీవన ఎరువుల వినియోగాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్న పచ్చిరొట్టి ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, వ్యవసాయ గ్రామ సహాయకులు వినీల్, విద్యాసాగర్రెడ్డి రైతులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



పచ్చిరొట్ట విత్తనాలను రైతుకు అందజేస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు: మండలంలోని గండవరం, గౌతమ్ నగర్ ఆర్బీకేల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారిణి సీహెచ్ఎస్ లక్ష్మి రైతులకు విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రస్తుతం నీటిలభ్యత లేనందున రైతులు పచ్చిరొట్ట పంట సాగు చేసుకుని భూమిని సారవంతం చేసుకొంటే భవిష్యత్లో మంచి దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని తెలిపారు. భూమి సారవంతమైతే ఎరువుల మోతాదు బాగా తగ్గించుకోవచ్చన్నారు. వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీపై పిల్లిపెసర, జీలగ, జనుము విత్తనాలు అందిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు ఒ.సుజిత్, టి.కవిత పాల్గొన్నారు.

అశ్వవాహనంపై నృసింహుడి విహారం



గిరి ప్రదక్షిణ

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని చప్పరోత్సవం, గిరి ప్రదక్షిణను శుక్రవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

హుండీ కానుకల ద్వారా రూ.7.43 లక్షలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ కానుకల ద్వారా రూ.7,43,769 వచ్చిందని ఈఓ గిరికృష్ణ పేర్కొన్నారు. వవ్వేరు, నవాబుపేట గ్రూప్ టెంపుల్స్ ఈఓలు వరప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకల లెక్కింపు


డీపీఓలో పోలీస్ వెల్ఫేర్ డే



సమస్యలను ఆరాతీస్తున్న సౌజన్య

నెల్లూరు(క్రైమ్): సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఏఎస్పీ సౌజన్య పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. గ్రేడ్ ఇంక్రిమెంట్లు, బదిలీలు, సస్పెన్షన్ రిలీవ్, డిప్యుటేషన్, ఆరోగ్య భద్రత తదితర సమస్యలను సిబ్బంది ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు ఆర్థిక ప్రయోజనాలు తక్షణమే వచ్చేలా చూడాలని ఆదేశించారు.

విద్యుత్కు అంతరాయాల్లేకుండా అన్ని ఏర్పాట్లు



రికార్డులను పరిశీలిస్తున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద జూన్ నాలుగున విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా అన్ని చర్యలు చేపట్టామని వివరించారు. విద్యుత్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో 24 గంటలూ విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. కౌంటింగ్ రోజున విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తకుండా ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఆరుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నిరంతరం పర్యవేక్షిస్తూ విధులు నిర్వర్తించనున్నారని పేర్కొన్నారు. అనంతరం కనుపర్తిపాడులోని సబ్స్టేషన్ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.